## శేషతల్పంపై పరమశివుడు



చౌడేపల్లి, మే 5 ప్రభాతవార్త
అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పార్వతీ, పరమేశ్వరులు శేషతల్పంపై ఊరేగారు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు, కుమారస్వామి, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. వాహనసేవకు ఆర్యవైశ్యసంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త


## షార్‌లో అగ్నిమాపక వారోత్సవ ముగింపు వేడుకలు




శ్రీహరికోట(తడ), మే 5, ప్రభాతవార్త
శ్రీహరికోటలోని సతీష్ దావన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించారు. స్థానిక బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీసెస్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్‌బి సింఘానే పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు పంచిపెట్టారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, కంట్రోలర్ ఎం. శ్రీనివాసుల రెడ్డి ప్రసంగించారు. సిజిఎం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిజిఎం శుభానందన్, డిప్యూటీ డైరెక్టర్ ముత్తుచిలియన్, దేవేంద్ర కుమార్ తదితరులతో పాటు షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధికి

# సమన్వయంతో విధులు

**- రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌ఛార్జీ ఆఫీసర్ ఎంటి కృష్ణబాబు**



కలెక్టర్, ఎస్పీలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

చిత్తూరు రూరల్, మే 5 ప్రభాతవార్త:
సిఎం ఆశయ సాధనకు అనుగుణంగా జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌ఛార్జీ ఆఫీసర్ ఎంటి కృష్ణబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం రాత్రి జిల్లా సమగ్ర అభివృద్ధికి వివిధ శాఖల ద్వారా అమలు అవుతున్న పథకాల అమలు తీరుపై రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం సొంత నియోజకవర్గం కుప్పంతో పాటు జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలకు అనుగుణంగా అధికారులు పని చేయాలన్నారు. జిల్లాకు సరిహద్దులుగా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు వుండటంతో పరిశ్రమల స్థాపనలు అధికంగా జరిగే అవకాశాలు వున్నాయని, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రతి మూడవ శనివారం అందరు ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవాలన్నారు. అలాగే వ్యవసాయ అధారిత పంటలకు ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంపొందించాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రం చిత్తూరుతో పాటు పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో సైతం ప్రత్యేకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను నిర్వహించడం జరుగుతున్నదన్నారు. ప్రధానంగా ప్రజల నుండి అందే అర్జీల్లో రీ-సర్వే, రికార్డ్స్ ఆఫ్ రైట్ ఆఫ్ ఆర్‌ఓఆర్, పోలీస్ క్రైమ్, భూఆక్రమణలు, సంబంధిత అంశాలపై అధికంగా అర్జీలు వస్తున్నాయన్నారు. శిశువులకు ఆధార్ నమోదు ప్రక్రియకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పశు సంవర్ధకశాఖ ద్వారా పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో వ్యవసాయ పరంగా చెరకు, మామిడి, వేరుసెనగ సాగు విస్తీర్ణం ఎక్కువగా వుందని, ఇక్కడ పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ సాగు ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాగే స్కిల్ ఆఫ్ చిత్తూరు కార్యక్రమం ద్వారా రైతులకు సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఏనుగుల దాడితో ఎక్కువ మంది రైతులు మృతి చెందుతున్నారని కలెక్టర్ వివరించారు. అలాగే భూగర్భ జలాల పెంపుకు ఉపాధి పథకం కింద ఫారమ్‌పాండ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా అటవీశాఖ అధికారి భరణి, అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాడల్, జడ్పీ సిఇఒ రవికుమార్‌నాయుడు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ సత్యనారాయణ, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, ఎపిఎస్‌పి డిసిఎల్ ఎస్ఇ ఇస్మాయిల్, జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణ, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ అధికారి ఆరీఫ్, హౌసింగ్ పిడి గోపాల్‌నాయక్, డిసిహెచ్ఎస్ పద్మాంజలి తదితరులు పాల్గొన్నారు.

## విలేజ్ హెల్త్ క్లీనిక్ రికార్డులు పక్కాగా నిర్వహించాలి



గుడుపల్లి, మే 5 ప్రభాతవార్త
మండలంలోని కనమనపల్లి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సందర్శించి అనంతరం ఎర్పాటు చేసిన కార్యక్రమంలో కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ పుట్టుక నుండి మరణించే వరకు ప్రతి వ్యక్తి ఆరోగ్య పరిరక్షణను రాష్ట్ర ప్రభుత్వం తన భాధ్యతగా తీసుకుందిఅని కుప్పం నియోజకవర్గ ప్రజలపై గల అభిమానంతో ముఖ్యమంత్రి టాటా సంస్థద్వారా హెల్త్ సర్వే చేస్తున్నారన్నారు.కుప్పంను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామన్నారు. అదేవిదంగా కుప్పం నియోజక వర్గ ప్రజల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.వైద్యఆరోగ్య శాఖ ద్వారా అందుతున్న విస్తృత సేవలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో దాదాపు 3లక్షల మంది జనాబ ఉన్నారని వీరి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవడానికి రాష్ట్ర ప్రభు త్వం టాటా సంస్త ద్వారా సర్వేచేసి సేకరించిన సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయడం జరిగిందన్నారు.ఈప్రక్రియ ద్వారా ప్రజల ఆరోగ్యస్తితులను ఎప్పుడైనా తెలుసుకునే అవకాశం ఉందన్నారు.ఈసమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పడాల్,ఎపియస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పియస్ మునిరత్నం,డాక్టర్ సురేష్ బాబు,గుడుపల్లి మండల అధ్యక్షుడు బాబునాయుడు,డిఎంహెచ్ఒ సుదారాణి, ఎంఆర్ఓ సీతారాం,ఎంపిడిఓ రాదాకృష్ణలు పాల్గోన్నారు.

## జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై

# అధికారులతో జేసీ సమీక్ష




తిరుపతి కలెక్టరేట్, మే 5 ప్రభాతవార్త :
తిరుపతి జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాని, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇంచార్జి ఆఫీసర్ ఎం.టి కృష్ణబాబు ఈనెల 6వ తేదిన మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జరిగిన,జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో శాఖా పరమైన అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయితీ అధికారి సుశీల, డ్వామా పీడీ శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా వైద్యశాఖ అధికారి డీసీహెచ్ఎస్ ఓ, ఎస్సీ ఎపీ ఎస్పీడీసీఎల్, ఎక్సైజ్, ల్యాండ్ అండ్ సర్వే, డీఈవో, డీఎస్‌వో, పంచాయతీరాజ్, డీడీ పశు సంవర్ధక శాఖ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మో... మళ్లీ ఏనుగులు వచ్చేసాయి...

**మామిడి తోటలను ధ్వంసం చేస్తున్న గజరాజులు...**
**భయంతో వణికిపోతున్న గ్రామస్తులు...**



రేణిగుంట మే 5 ప్రభాతవార్త
అమ్మ బాబోయ్... మళ్లీ ఏనుగులు గుంపు రేణిగుంట మండలం మామండూరు మామిడి తోటలపై దాడులు చేస్తున్నాయి. సుమారు ఐదు ఆరు ఏనుగుల గుంపు మామిడి తోటలపై గత పది రోజులుగా విరుచుకుపడి కొమ్మలను ధ్వంసం చేస్తూ పిందెలను, దోరగా పండిన కాయలను నేలపాలు చేస్తున్నాయి. మామిడి రైతులు లబోదిబోమని అల్లాడుతున్నారు. ఇంతకాలం కంటికి రెప్పలా కాపాడుకున్న మామిడి పంట నేలపాలవడం రైతులు దుఃఖంతో కన్నీళ్లు పెడుతున్నారు. ఏనుగులు రాకుండా ఫారెస్ట్ అధికారులు సిబ్బందిని నియమించి పహారాకాస్తున్నప్పటికీ వారి కనుకప్పి వేరొక మార్గంలో తోటల్లోకి ప్రవేశిస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఏనుగుల దాడులను అరికట్టలేకపోతున్నారని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏనుగులు దాడులు చేసినప్పుడు అధికారులు దాడులు జరగకుండా ఏనుగులకు ప్రమాదం జరగకుండా విద్యుత్ పెన్సింగ్ ఏర్పాటు చేస్తామని, అడవులకు తోటలకు మధ్య పెద్ద గొయ్యి తవ్వుతామని చెప్పిన హామీలు ఏమయ్యాయి అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఏనుగులు ఎక్కడ తమ గ్రామాలపై దాడి చేస్తాయో అని మామండూరు, కుక్కల దొడ్డి, చైతన్య పురం ప్రజలు హడలి పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని ఏనుగులు గ్రామాలు, పంట పొలాలు, తోటలపై దాడులు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# భక్తుల సదుపాయాలకే పెద్దపీట

**శాశ్వత అభివృద్ధికి ఊతం : ఇఓ డి.బాపిరెడ్డి**



శ్రీకాళహస్తి,మే 5 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదాయాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని,అలాగే భక్తుల సంఖ్య కూడా పెరుగుతుందని వచ్చే భక్తులకు సకల సదుపాయాల కల్పనకే పెద్ద పీట వేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.బాపిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన ప్రభాతవార్తతోమాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంలో శాశ్వత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం తమంతట తాము నిర్ణయాలు తీసుకోలేమని ప్రతిపాదనలు దేవాదాయశాఖకు పంపి అనుమతి వచ్చిన తరువాత అమలు చేయాల్సి ఉందన్నారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన భవన సేకరణ ఫైల్‌ను జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి పంపుతున్నారని అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత నష్టపరిహారం చెల్లించి దశల వారిగా మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామన్నారు.మహాశివరాత్రి ముందు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు.

**అన్నికౌంటర్లు ఒకే చోట:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి తిరుమల వాతావారణం కల్పించుటకు స్థానిక శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి సూచనలతో ప్రణాళికలు రూపొందించి అమలుకు ప్రయత్నిస్తున్నామన్నారు.ఆలయంలోపల ఎలాంటి కౌంటర్లు, సేవా కౌంటర్లు లేకుండా ఒకే చోట అన్ని కౌంటర్లు ఉండేటట్లు అంచనాలు తయారు చేసామన్నారు. ఒకటి,ంరెండవ గేట్ల మధ్య అన్ని కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఇక్కడే భక్తులు సెదతీరేవిధంగా సెల్లార్లు ఏర్పాటు చేస్తున్నామని ఇఓ బాపింరెడ్డి తెలిపారు. పరిపాలనలో సమస్యలు తన దృష్టికి వచ్చిన వెంటనే యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరిస్తున్నట్లు వివరించారు. కాగా భక్తులకు వేసవి కాలంలో ఇబ్బందుల్లేకుండా ఆలయం లోపల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీటితో పాటు ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వచ్చిన భక్తులకు నాణ్యమైన భోజనాలు అందిస్తున్నామని తెలిపారు.

# 7,8వ తేదీల్లో మంత్రి నారా లోకేష్ తిరుపతి జిల్లాలో పర్యటన : కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, మే 5 ప్రభాతవార్త :
ఈ నెల 7,8వ తేదీల్లో రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ మంత్రి నారా లోకేష్ బాబు రెండు రోజుల పర్యటనలు నిమిత్తం తిరుపతి జిల్లాకు రానున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా ముంబై ఎయిర్‌ఫోర్ట్ నుంచి బయలు దేరి బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని 3.40 గంటలకు రేణిగుంట ఎయిర్‌ఫోర్ట్ నుంచి రోడ్డు మార్గాన సాయంత్రం 5.10 గంటలకు వీఎమ్‌కే కల్యాణ మండపం సత్యవేడుకు చేరుకుని 5.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అక్కడ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని, 8వ తేదిన ఉదయం 10.30 గంలకు విఎమ్‌కే కల్యాణ మండపం, సత్యవేడు నుంచి బయలు దేరి ఉదయం 10.50 గంటలకు శ్రీ సిటీ చేరుకుని 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ వారి భూమి పూజ శంఖు స్థాపన కార్యక్రమాల్లో పాల్గొని మధ్యాహ్నం శ్రీ సిటీ నుంచి రోడ్డు మార్గం ద్వారా రేణిగుంట విమానాశ్రయం 2.30 గంటలకు మంత్రి చేరుకుని ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు వెళతారని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలియజేశారు.

# అక్రమార్కులకు అండగా ఖాకీలు !



**-పక్క రాష్ట్రాలకు తరలి వెళ్తున్న గ్రావెల్,ఇసుక**
**-పేటలో కోడి పందాలు, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు**



చిట్టమూరు,మే 5,ప్రభాతవార్త
చట్టాన్ని,ప్రకృతి సంపదలను కాపాడాల్సిన అధికారులే చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న విలువైన ప్రకృతి సంపద యదేచ్ఛగా ఎల్లలు దాటుతున్న పోలీస్ రెవెన్యూ అధికారులు తమ జేబులు నింపు కోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు . వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రకృతి సంపద దోపిడీ కంటే మేమేమి తక్కువ కాదన్నట్లు అందుకు పదిరెట్లు కోటమ నాయకులు తమ దందా కొనసాగిస్తూ కోట్లాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు . ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలోని నాయుడుపేట ద్వారా సత్రం మండలాల నుండి ఎంతో విలువైన ఇసుక ఎర్ర బంగారం నిత్యం వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిపోతున్న అధికారులు కల్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్న తీరు పట్ల నియోజకవర్గ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు .అక్రమార్కులకు అండగా పేట పోలీసులు తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తు స్వామి భక్తిని చాటుకుంటుండడంతో కోట్లు విలువ చేసే ప్రకృతి సంపదను కూటమి నాయకులు స్వాహా చేస్తున్నారు. ఏకంగా జిల్లాలు దాటి రాష్ట్రాలకు వనరులు తరలించి జేబులు నింపుకుంటున్నారు తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో అవినీతి పరిపాలనా కొనసాగుతుంది. నాయుడుపేట సరిహద్దు ప్రాంతాల నుండి స్వర్ణముఖి నది నుండి రెయిన్బోలో టిప్పర్లతో సహాయంతో పక్క రాష్ట్రాలకు ఇసుక తరలి వెళ్తూనే ఉంది. దీనికి తోడు సూళ్లూరుపేట, నాయుడుపేట, దొరవారి సత్రం, ఓజిలి మండలాల్లో ఉన్న ప్రభుత్వ భూముల నుండి ఎర్ర బంగారం నిత్యం 50 నుండి 100 టిప్పర్లతో సహాయంతో ఓవైపు పారిశ్రామిక వాడలకు, మరోవైపు తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు ఎర్ర బంగారం అవలీలగా వెళుతూనే ఉంది. ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు ఈ ఎర్ర బంగారంపై ఫిర్యాదులు చేస్తే కొంతమంది కూటమినేతలు పోలీసులను అడ్డం పెట్టుకొని ఫిర్యాదులు చేయకుండా స్థానిక గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేసిన ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ..అటవీ ప్రాంతాల్లో విచ్చలవిడిగా కోడిపందాలు,పేకాట నాయుడుపేట మండల పరిధిలోని పుదురు, బిరుదవాడ తదితర ప్రాంతాలతో పాటు డివి సత్రం పరిధిలోని నెలబల్లి, కలగుంట, నేలపట్టు అటవీ ప్రాంతాల్లో లక్షల్లో పేకాట రాయలు పేకాట నిర్వహిస్తూనారు. అదేవిధంగా వెదురుపట్టు, బురదమడుగు, మంగళంపాడు, మీ జూరు, తదితర ప్రాంతాలలో కోడి పందాలు ఇష్టారాజ్యంగా పందెం నిర్వహణలు జాతరను తలపిస్తున్నాయి. అయితే స్థానిక అధికారుల కనుసన్నంలోనే కోడి పందెలు , పేకాట తదితర చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

**పుట్టగొడుగుల్లా బెల్ట్ షాపులు......**
**-పోలీసుల జేబులోకి నెలవారి మామూలు**

రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ కూడా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయకూడదని, నిబంధన లు పాటించని వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆదేశాలు జారీ చేసిన సూళ్లూరుపేట నియోజకవర్గంలో అమలకు నోచుకోవడం లేదు. . గ్రామాలు పట్టణాలు అనే తేడా లేకుండా వీలైనన్ని ఎక్కువ బెల్ట్ షాపులు పెట్టి దోచుకోవడమే ధ్యేయంగా కూటమి నాయకులు ధ్యేయంగా కనిపిస్తుంది . ఓవైపు అనధికార షాపుల నిర్వహణతో పాటు పగలు రాత్రి తేడా లేకుండా అమ్మకాలు సాగిస్తున్న అధికారులు గానీ, పాలకుల గాని పట్టించుకోవడం లేదు. బెల్ట్ , అనధికార షాపుల నిర్వాహకుల నుండి లక్షల రూపాయలు అధికారులు జేబులోకి వస్తున్నాయి. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం బాట్లపై అధిక రెట్లుతో అమ్మకాలు జరుపుతున్నారు. అదేవిధంగా పల్లెల్లో ఈ బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంతో నిరంతరం మందుబాబులు మద్యం తాగి కుటుంబాల్లో తరచూ గొడవల కి మూలం అవుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించి సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

# అకాల వర్షానికి తడిచిన పంట

**అన్నదాతల అవస్థలు ...**



నాయుడుపేట ఏప్రిల్ 5 ప్రభాతవార్త;
నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి అన్నధాతలకు అపారనష్టం జరిగిన సంగతి తెలిసిందే,రైతులు ఆరుగాలం కష్టపడి వేలకువేలు అప్పులుచేసి వ్యవసాయసాగు చేపట్టి పంటలు చేతికందే దశలో వాతావరణంలో మార్పులు కారణంగా అకాల వర్షాలు కురవడంతో సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో రైతుల ధాన్యం తడిచిపోయింది.దీంతో అన్నధాతలు తడిచిన వరి,మిరప,వేరుశనగను కల్లాల్లో ఆరపెట్టుకుంటూ అవస్థలు పడుతున్నారు. తడిచిన ధాన్యంను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు వాపోతున్నారు.గ్రామాల్లో రైతులు పడుతున్న అవస్థలను చూస్తుంటే ప్రజల హృదయాలు కలచివేస్తున్నాయి. కురిసిన అకాల వర్షంలో పిడుగుపాటుకు గురై ముగ్గురు మృతిచెందారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 273 ఫిర్యాదులు

పలమనేరు,మే 5,ప్రభాతవార్త:
పలమనేరులో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్)కు 273 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు.స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి,జేసి విద్యాధరి,ఆర్డీఓ భవానిలు ప్రజల వద్ద ఫిర్యాదులను స్వీకరించారు.పలు సమస్యలపై ప్రజలు ఫిర్యాదులను అధికారులకు అందించారు.అందులో అధికంగా రెవెన్యూ



సమస్యలపై ఫిర్యాదులను అధికారులు అందుకున్నారు.అధికారులు స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులకు అందించి తక్షణం సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే,జేసి అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈఓ రవికుమార్ నాయుడు,పి.ఆర్.ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి,డ్వామా పిడి రవికుమార్,డి.పి.ఓ సుధాకర్ రావు,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వైభవంగా కాలభైరవేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన



కల్లూరు, మే 5, ప్రభాతవార్త
పులిచెర్ల మండలం జాండ్రపేట శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కాల భైరవేశ్వర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా ప్రారంభమ య్యాయి. శనివారం రాత్రి గణపతి ప్రార్ధన వాస్తు పూజతో ఉత్సవాలకు నాంది పలికారు ఆదివారం. గణపతి పూజ, గంగపూజ, కలశ స్థాపన, అంకురార్పణ, కాలభైరవేశ్వర స్వామి హోమం, మృత్యుంజయ హోమం నిర్వహిం చారు. పూజలు చేసి. మహా మంగళారతి గావించారు. సోమవారం ప్రాణ ప్రతిష్ట. మహా కుంభాభిషేకం. అలంకారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర దీక్షితులు, వేద పండితులు సోమశేఖర దీక్షితులు, ఆత్రేయ శర్మ, చక్రధర శర్మ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## స్కూటర్లు ఢీకొని ఇద్దరికి గాయాలు



సదుం, మే 5, ప్రభాతవార్త
ఎదురెదురుగా వచ్చిన రెండు స్కూటర్లు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన సోమవారం సాయంత్రం సదుం పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు ఒఫ్యాక్టరీలో కార్మికులుగా ఒడిస్సాకు చెందిన అప్పి నాయక్, దీపు పని చేస్తున్నారు. వారు ద్విచక్రవాహనంలో వస్తూ బ్రాహ్మణ వీధిలోని రామమందిరం సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని అదుపుతప్పి ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో 108 వాహనంలో పీలేరుకు తరలించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనపై కేసు నమోదు

సదుం, మే 5, ప్రభాతవార్త
రేష్ డ్రైవింగ్ తో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్షావల్లి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు ఈ నెల నాలుగో తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కే ఏ 53 ఎం ఎఫ్ 9820 అను వాహనమును కురవపల్లి గ్రామానికి చెందిన దేవేంద్ర తన రెనాల్ట్ క్విడ్ వాహనాన్ని నిర్లక్ష్యంగా దురుసుగా నడుపుకుంటూ వచ్చి ఎదురుగా వస్తున్నటువంటి ద్విచక్ర వాహనం ఏపీ 03 ఏ ఎక్స్ 5706 ను ఢీకొన్నాడు. దీనితో వాహనం నడుపుతున్న సోమల మండలం ఎగువ గొల్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన పి.సుబ్రమణ్యం, వెనక వైపు కూర్చున్నటువంటి హరిబాబులకు రక్త గాయాలు అయ్యాయని చెప్పారు. దీనిపై హరిబాబు అక్క బి సావిత్రమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

## నేడు జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం

చిత్తూరు రూరల్, మే 5 ప్రభాతవార్త:
కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుతో పాటు జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ అనుబంధ సంస్థలు, వైద్య, విద్య, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్, డ్వామా, హౌసింగ్, పంచాయతీరాజ్, పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో సాధించిన పురోగతిపై సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమా వేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా 5 మంది నియామకం

చిత్తూరు, ఏప్రిల్ 5 ప్రభాతవార్త:
చిత్తూరు జిల్లా నుండి టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా ఐదు మంది నియమితులయ్యారు. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి సేవలు అందించిన వారికి కేంద్ర ప్రభుత్వ సంస్థ బిఎస్ఎన్ఎల్ టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యులుగా నిమమించాలని కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ మంత్రికి సిఫార్సు చేశారు. ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు లేఖకు స్పందించిన కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ జిల్లాకు చెందిన డి.సునీత, ఎం.కోదండయ్య, కె.లోకనాదరెడ్డి, కె.సాయి సమీర్‌కుమార్, ప్రకాష్‌లను టిఎసి సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్బంగా తన సిఫార్సును పరిగణనలోకి తీసుకుని టిఏసి సభ్యులుగా నియమించినందుకు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కేంద్ర సమాచార, సాంకేతిక శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎంపిడిఓలుగా ఐదుగురికి పదోన్నతి

చిత్తూరు, మే 5 ప్రభాతవార్త:
డిప్యూటీ ఎంపిడిఓ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఇఓఆర్డీలుగా విధులు నిర్వహిస్తున్న ఐదు మందికి ఎంపిడిఓలుగా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు వారికి జిల్లాలో ఎంపిడిఓలుగా పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రావారిపాళ్య ఇఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న మాలతిని కెవిబిపురం ఎంపిడిఓ, నాగలాపురం ఇఓఆర్డీ వెంకటరత్నమ్మను బిఎన్ కండ్రిగ ఎంపిడిఓ, రామకుప్పం ఇఓఆర్డీ రాదాకృష్ణను గుడుపల్లి ఎంపిడిఓ, వెదురుకుప్పం ఇఓఆర్డీ పురుషోత్తంను వెదురుకుప్పం ఎంపిడిఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇతర జిల్లాల నుండి ఇఓఆర్డీ నుండి పదోన్నతిపై ఎంపిడిఓగా వచ్చిన శిరీషను గుడిపాల ఎంపిడిఓగా నియమిస్తూ జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

## తహసిల్దార్ సేవలకు నీరాజనాలు పలుకుతున్న మండల ప్రజలు

పూతలపట్టు, మే 5, ప్రభాతవార్త
పూతలపట్టు మండలంలో అనేక దశాబ్దాలుగా తాశీల్దార్లు రావడము వారి కర్తవ్యం చూసుకొని వెళ్లిపోవడం జరిగాయి. కానీ ప్రస్తుతం ఉన్న తహసిల్దార్ రమేష్ బాబు వచ్చినప్పటి నుంచి ప్రజలు ప్రతి సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదులకు తాసిల్దార్ కార్యాలయానికి అర్జీలతో పోటు ఎత్తడం జరిగినది. తన కార్యాలయానికి వచ్చిన ప్రతి ఒక రైతుని ప్రతి ఒక సామాన్యుడిని దగ్గరకు తీసుకొని వారి సమస్యలను విని వీలైతే అక్కడే పరిష్కారం చేసే దిశగా చొరవ తీసుకుంటూ కొన్ని సమస్యలను క్షేత్రస్థాయికి తనే స్వయంగా వెళ్లి పరిశీలన చేసి సమస్యలను పరిష్కరించడం జరిగినది. ఇప్పటివరకు ఏ ఒక్క తహసిల్దార్ కూడ ప్రజలను దగ్గరకు తీసుకుని సమస్యల పరిష్కారానికి దారి చూపించడం ఇదే మొట్టమొదటిసారి అని పూతలపట్టు మండల ప్రజలు తాసిల్దార్ రమేష్ బాబు సేవలు అమోఘమని హర్షం వ్యక్తం చేస్తూ ఇలాంటి తాసిల్దార్ ఎప్పటికీ మా మధ్యనే ఉండి పోవాలంటే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నిరుపేదలకు పక్కాగా వైద్య సేవలు

### - చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

చిత్తూరు రూరల్, మే 5 ప్రభాతవార్త:
చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే నిరుపేద రోగులకు పక్కాగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌ఛార్జీ ఆఫీసర్ ఎంటి కృష్ణబాబు వైద్యాధికారులను ఆదేశించారు. చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి వైద్య, ఆరోగ్య స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జోనల్ ఇన్‌ఛార్జీ ఆఫీసర్ కృష్ణబాబు అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకును పరిశీలించారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య విధాన పరిషత్, అపోలో వైద్య సంస్థ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

## పక్కాగా సమస్యలు పరిష్కారం : ఎస్పీ



చిత్తూరు టౌన్, మే 5 ప్రభాతవార్త:
సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పక్కాగా పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాల యంలో సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి 38 మంది హాజరై వారి సమస్యలను ఎస్పీ మణికంఠ చందో లుకు వివరించారు. ప్రజల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్న ఎస్పీ ఆ సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూ తగాదాలకు సంబంధించి 13, కుటుంబ తగాదాలు 12, వేధింపులు 4, ఇంటి తగాదాలు 4, చీటింగ్ 2, ఆస్తి తగాదాలు 2, భర్త వేధింపులపై ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ, ఇన్‌ఛార్జీ అడ్మిన్ ఎఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, డిటిసి డిఎస్పీ జె.రాంబాబులు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

## జీవో నెం. 77ను వెంటనే రద్దుచేయాలి

### - ఐసెట్ ప్రవేశ పరీక్షలను అడ్డుకుంటామని హెచ్చరించిన ఏబివిపి

చిత్తూరురూరల్, మే 5 ప్రభాతవార్త:
ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో జీవోనెం 77ను రద్దుచేస్తానని హామిఇచ్చి. నేటికి 335రోజులు పూర్తవుతున్న ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోవడం చాలా బాధాకరమని ఏబివిపి జాతీయ కార్యవర్గసభ్యులు పూజారిరాఘవేంద్ర ఆవేదన వ్యక్తం చేసారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థిపరిషత్ ఆద్వర్యంలో తిరుపతి కార్యాలయం నందు తిరుపతి, చిత్తూరు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం 77తో ప్రైవేట్ కళాశాలలలో పిజి విద్యను అభ్యసించాలనుకున్న పేద విద్యార్థులకు శాపంగా మారిందని. ఏబివిపి గత నాలుగు సంవత్సరాల నుంచి అనేక ఉద్యమాలు చేస్తున్న పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గత సంవత్సరం కూడా జీవోనెం 77ను రద్దు చేయకుండా ప్రైవేట్ కళాశాలలో పిజి అడ్మిషన్లు జరిగాయనీ, ఈ సంవత్సరం రద్దు చేయకుంటే 7నుంచి జరగనున్న ఐసెట్ ప్రవేశ పరీక్షను ఏబివిపి అడ్డుకుంటుందని హెచ్చరించారు. ఇప్పటికైనా మంత్రి నారాలోకేష్ జీవోనెం 77ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి ప్రైవేట్ కళాశాలలో పిజి విద్యను అభ్యసించాలనుకున్నటువంటి విద్యార్థులకు న్యాయం చేస్తూ ఐసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేంద్ర, పవన్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం

### - ఒక దుకాణం సీజ్ చేసిన హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్

చిత్తూరురూరల్, మే 5 ప్రభాతవార్త:
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధికారులు చిత్తూరు నగర పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించారు. నిషేధిత సింగిల్ యూజ్ ప్లాసిక్ వస్తువులను విక్రయించరాదని పలుమార్లు చెప్పిన నగరంలోని కొంతమంది దుకాణదారులు వినకపోవడంతో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో సోమవారం శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పలు దుకాణాలపై దాడులు నిర్వహించి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో చిత్తూరు చర్చివీధిలోని ఓ దుకాణంలో నిషేధిక ప్లాస్టిక్ వస్తువులు పెద్ద మొత్తంలో వుండటంతో ఆ దుకాణంను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ సీజ్ చేశారు. మరో ఆరు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 105 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారికి 25 వేల రూపాయల అపరాధ రుసుం విధించి నోటీసులు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చిత్తూరు నగర పరిధిలో ఎక్కడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించరాదని ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

## అనాధ శవానికి అంత్యక్రియలు



పలమనేరు,మే 5 ప్రభాతవార్త:
అనాధ శవానికి అంత్యక్రియలు చేపట్టి పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు వారి మానవత్వాని చాటుకున్నారు. పలమనేరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ అనాధ ఈనెల 2న ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా అతని ఆరోగ్యం పూర్తిగా విషమించి ఈనెల 4న మృతి చెందడం జరిగింది.దీంతో విషయం తెలుసుకున్న పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పలమనేరు సిఐ నరసింహరాజు సూచన మేరకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు నాగశివ,శక్తి,ప్రసాద్,యువరాజ్,నరేంద్రలు మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి నుండి స్థానిక గాంధీనగర్ స్మశాన వాటికకు తరలించి మృతదేహానికి అంత్యక్రియలు చేపట్టారు.

## గర్భవతుల పట్ల అప్రమత్తంగా వుండాలి : పవన్



చారాల(చౌడేపల్లి), మే 5 ప్రభాతవార్త
అధిక ప్రమాద గర్భవతుల పట్ల అప్రమత్తంగా వుండాలని మండల వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని చారాలలో గల ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. ఎంఎల్‌హెచ్‌పిలు సమ్మెలో వున్నందున క్లినిక్ బాధ్యతలను ఎఎన్ఎంలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రమాదస్థాయిలో వున్న గర్భవతులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. అదే విధంగా ఎన్‌సిడి సర్వే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే కిషోరి వికాసానికి తప్పకుండా హాజరై వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేసారు. పలువురికి వైద్య సేవలందించారు. ఎఎన్ఎం ఉషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13న సీజ్ చేసిన వాహనాల వేలం

తవణంపల్లె, మే 5 ప్రభాతవార్త:
మండలంలో ఎక్సైజ్ కేసులకు సంభందించి పట్టుబడిన వాహనాలను అనెల 13న తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు స్థానిక ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మండలంలో వివిధ ఎక్సైజు కేసుల్లో పట్టుబడిన ఈచర్ లారీ, ఆరు మోటారు సైకిల్ వాహనాలను జిల్లా ఎక్సైజు సూపరెండెంట్ ఆదేశాల మేరకు ఈనెల 13న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.నిర్ణీ రుసుమును చెల్లించి వేలంలో పాల్గొనాలని ఎస్సై తెలిపారు.

## నంది వాహనంపై శ్రీ కామాక్షిదేవి శ్రీ సదాశివేశ్వరుడు



పుత్తూరు రూరల్, మే 5 ప్రభాతవార్త:
పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం అమ్మవారు, స్వామివారు నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. రాత్రి ప్రత్యేక మంగళ వాయిద్యాలు నడుమ విద్యుత్ దీపాలంకరణతో స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనాలు ఇచ్చారు.

నేడు ఆలయంలో...
శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్బంగా మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లు గజ వాహనంపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



**శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరకు సంబంధించి అధికారులతో భద్రత ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు**

ప్రభాతవార్త - తిరుపతి

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై తహాశీల్దార్‌కు వినతి



కుప్పం, మే 5 ప్రభాతవార్త
ఆర్టీసీ ఉద్యోగులు,సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని తహశీల్దార్ చిట్టిబాబుకు ఎన్ఎంయుఎ నేతలు మోహన్, స్వామి, మునెప్పలు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 01/2019 సర్క్యులర్‌ను కుప్పం డిపోలో అమలు చేయాలన్నారు. గ్యారేజ్‌సిబ్బంది తగినంత మంది లేరని అందుకు అవసరమైన స్పేర్స్, టూల్స్ సరఫరా చేయాలన్నారు. మహిళా సిబ్బందికి అవసరమైన సెలవులు మంజూరు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఆన్‌కాల్ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. రిటైర్డ్ అయిన సిబ్బందికి కనీస పెన్షన్ ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పింఛను అమలు చేయాలన్నారు. సంస్థ పరంగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు కుమార్, రాజా, నాయక్, బాలబ్రహ్మం, విజయ్‌కుమార్, బాలకృష్ణ, గోవిందరాజులు, మొగిలీశ్వరయ్య, మురళీకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

## గంగమ్మ ఆలయానికి రూ. 15వేలు విరాళం



కుప్పంరూరల్, మే 5 ప్రభాతవార్త
కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారికి ఆలయ కమిటీ డైరెక్టర్ వినయ్ పదిహేను వేల రూపాయలు విరాళంగా అందించారు. తన రెండో కుమారుడు జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబీకులతో కలసి ఛైర్మన్ రవిచంద్రబాబుకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రిమాండ్

శాంతిపురం, మే 5 ప్రభాతవార్త
మద్యం తాగి వాహనం పడిపిన వ్యక్తికి న్యాయమూర్తి పద్నాలుగు రోజుల రిమాండ్ లేదా రెండువేల జరిమానా విధించినట్లు రాళ్లబూదుగూరు ఎస్సై నరేష్ తెలిపారు. మండలంలోని గుంజార్లపల్లికి చెందిన మురళీమోహన్ (31) అనే వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడన్నారు. అతన్ని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి జరిమానా విధించగా అతను చెల్లించకపోగా పద్నాలుగు రోజుల రిమాండ్‌కు ఆదేశించారన్నారు. మండలంలో ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## నేడు శ్రీ తిరుపతి గంగమ్మ జాతర చాటింపు

కుప్పం, మే 5 ప్రభాతవార్త
జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమాంబ జాతర చాటింపు కార్యక్రమం మంగళవారం అర్ధరాత్రి నిర్వహించనున్నారు. ఏటా అమ్మవారి జాతరకు 14 రోజుల ముందు చాటింపు వేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈనెల14వతేది నుంచి జాతర ఉత్సవాలు పూర్తిస్థాయిలో మొదలు కానున్నాయి. 20వతేది శ్రీ తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు, 21న అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర ముగియనుంది. జాతర నిర్వహణకు సంబంధించి కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు అధ్వర్యంలో ఏర్పాట్లు మొదలు కానున్నాయి.

## అధునాతన పద్ధతులతో అధిక డిగుబడి



తవణంపల్లె, మే 5 ప్రభాతవార్త:
వ్యవసాయ సాగులో అధునాతన పద్ధతులను అవలంభించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చునని ఉద్యానశాఖ అసిస్టెంట్ శ్రీధర్ అన్నారు. సోమవారం మండలంలోని మత్యం గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు సోమవారం నైపుణ్య అభివృద్ధిపై శిక్షణా కార్యక్ర మం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానంను అందిపుచ్చుకుని అధునాతన పద్ధతులను అవలంభించి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. అలాగే రైతులకు డిజిటల్ పేమెంట్, వాతావరణ సమాచారం, మార్కెట్‌లో ధరల వివరాలు, యూట్యూబ్‌లో వ్యవసాయానికి సంభందించి సమాచారం తెలు సుకునేం దుకు, ప్రభుత్వ పథకాల గురించి సమాచారం ఎలా తెలుసుకోవాలో రైతులకు వివరించారు. ఈకార్య క్రమంలో సాయిల్ కన్సర్వేషన్ ఏఓ భారతి, రైతు సేవాకేంద్రం ఇన్‌చార్జిలు జ్యోతినాద్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రావూరి ఈశ్వరరావు జన్మదిన వేడుకలు

చిత్తూరురూరల్, మే 5 ప్రభాతవార్త:



తన సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బడుగు, బలహీన వర్గాలకు జీవనోపాధి కల్పించి ధార్మిక రత్నగా పేరు గడించిన రావూరి ఈశ్వరరావు జన్మ దిన వేడుకలను ఆయన సన్ని హితులు ఘనంగా నిర్వహిం చారు. సోమవారం ఆయన స్వగృహంలో భాజపా శ్రేణులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువ, గజ మాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలను తెలియజేసారు. సత్కరించినవారిలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, ఓబిసి రాష్ట్ర కార్యవర్గసభ్యులు సుధాకర్, నగర బిజెపి నాయకులు సత్య, ఆపస్ జిల్లా అదికార ప్రతినిధి రాధా కృష్ణన్‌లు వున్నారు.

## పిజిఆర్ఎస్‌కు 5 ఫిర్యాదులు

చిత్తూరు, మే 5 ప్రభాతవార్త:
చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం కమీషనర్ నరసింహప్రసాద్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ వారం ఐదు ఫిర్యాదులు అందాయి. ప్రజల నుండి అందిన ఫిర్యాదులను పరిశీలించి మున్సిపల్ కమీషనర్ సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమలో ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించి 2, రెవెన్యూ విభాగం 2, ప్లానింగ్ విభాగంకు సంబంధించి ఒక సమస్య అందాయి. ఈ కార్యక్రమలో మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, టిపిఓ సుభప్రభ, ఇన్‌ఛార్జీ మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అపోలో వైద్యుల నిర్లక్ష్యంతో గాలిలో ప్రజల ప్రాణాలు

### - సత్వరం ఎంఓయు రద్దుకు చర్యలు

### - వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసి విన్నవించిన మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్



చిత్తూరు, మే 5 ప్రభాతవార్త:
చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చి చికిత్స చేసుకుంటున్న రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఈ విషయంపై ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబును కలిసి మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం కోరారు. చిత్తూరు పర్యటన నిమిత్తం వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీని సోమవారం మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం కలిసి అపోలో వైద్యుల నిర్లక్ష్య వైద్యంపై వినతిపత్రం అంద జేశారు. తన కుమార్తె అపోలో వైద్యుల నిర్లక్ష్య వైద్యం వల్ల మృతి చెందిందని ఈ విషయంపై తక్షణం విచారణ నిర్వహించి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవా లన్నారు. అలాగే ప్రభుత్వం అపోలో యాజమాన్యంతో కుదుర్చుకున్న ఎంఓయును రద్దు చేసి చిత్తూరు ఆసుపత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి శోభారాణి, రాష్ట్ర తెలుగుదేశం మహిళా ఆర్గనైజింగ్ కార్య దర్శి, మాజీకార్పొరేటర్ సిఎం విజయ, మాజీకార్పొరేటర్ కంద, హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాత్రిపూట రోడ్డుపై జంట ఏనుగులు హల్‌చల్

రామకుప్పం, మే 5 ప్రభాతవార్త
మండలంలోని ననియాల అటవీ ప్రాంతంలో ఉన్న రోడ్డుపై ఆదివారం రాత్రి జంట ఏనుగులు హల్‌చల్ చేశాయి. ననియాల సమీపంలో ఉన్న నర్సరీలో మొక్కలను తొక్కేశాయి. ట్రాకర్లు ఏనుగుల దారి మళ్లింపుకు బాణసంచా కాల్చి విశ్వ ప్రయత్నాలు చేశారు. గత వారం రోజులుగా ఈ ఏనుగులు ననియాల, సింగసముద్రం, నారాయణపురం తాండా, పచ్చారమాకులపల్లి ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. అటవీ అధికారులు స్పందించి ఏనుగుల దాడుల నిరోధానికి శాశ్వత చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# తిరుపతి డివిజన్

## పుణ్యక్షేత్రం దుర్గంధ మయం: వైకాపా ధ్వజం



శ్రీకాళహస్తి,మే 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిందని అయితే ఇక్కడ మున్సిపల్ పారిశుద్ధ్యశాఖ వైఫల్యంతో దుర్గంధ భరితంగామారిందని అయితే ఉన్నతాధికారులు కానీ పాలకులు పట్టించుకోవటం లేదని వైకాపా నాయకుడు మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు శివమెత్తారు. శ్రీకాళహస్తి పట్టణంలో పురాతన కాలం నాటి మురుగునీటి కాలువలున్నాయని నేటి అవసరాలను అవి తీర్చలేకున్నాయన్నారు. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే అతిథులు, భక్తులు నాలుగు మాడావీధుల్లో సంచరిస్తుంటారని ఇక్కడ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాల్సి ఉందన్నారు. ఇక్కడ మాత్రం ప్రతి రోజూ మురుగునీటి కాలువలు శుభ్రం చేయాల్సి ఉందన్నారు. కానీ మున్సిపల్ అధికారులు వారం పది రోజులకు ఒకసారి కూడా మురుగునీటి కాలువల్లో పేరుకుపోతున్న డస్ట్ శుభ్రం చేయటం లేదన్నారు. గతంలో ప్రతి ఇంటికి లెట్రిన్ ఉండేదని దానికి గుంట ఉండేదన్నారు. నేడు నాలుగుమాడావీధులు లాడ్జిల మయం అయ్యాయని లెట్రిన్ పైపులు ఈ కాలువల్లో వదలిపెట్టడం వల్ల దుర్గంధ భరితంగా మారాయన్నారు. అలాంటి ప్రాంతాల్లో పదిరోజులకొక మారు అంటే ఎలా అని అంజూరు తారక శ్రీనివాసులు ప్రశ్నించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటి పన్నుల వసూళ్ళపై చూపుతున్న శ్రద్ధ ప్రజా వసరాల మీద చూపటం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. శానిటరి ఇన్స్పెక్టర్ కనబడరని వివమర్శించారు. ఆయన పట్టణంలోని పీర్లచావడి వీధిలో దుర్గంధ భరితమైన మురుగునీటి కాలువను తమస హాచరులు మాజీ కౌన్సిలర్లు ఉత్తరాజి శరవణ కుమార్, కంఠా ఉదయ్‌కుమార్, శ్రీవారి సురేష్, విజయ కుమార్‌రెడ్డిలతో కలసి పరిశీలించారు.

## కార్మికుల ఊపిరి కార్ల్‌మార్క్స్



తొట్టంబేడు, మే 5 ప్రభాతవార్త : ప్రపంచ కార్మికుల ఊపిరి, కమ్యూనిష్టు పితామహుడు కార్ల్ మార్క్స్ అని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య అన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందయ్య భవనంలో సోమవారం కార్ల్‌మార్క్స్ 207వ జయంతిని నిర్వహించారు. మార్క్స్ చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. కార్మిక వర్గాన్ని దోపిడీనుంచి విముక్తి చేసే గొప్ప సిద్ధాంతాన్ని మార్క్స్ రూపొందించారని పుల్లయ్య తెలిపారు. పెట్టుబడి దారీ సమాజంలో నిరుద్యోగం, పేదరికం రోజురోజుకు తీవ్రవవుతు న్నాయని చెప్పారు. ఒక మనిషిని ఇంకొక మనిషి దోడిడీ చేసే వ్యవస్థకు వ్యతరేఖంగా పోరాటాన్ని కార్ల్‌మార్క్స్ ఉధృతం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గంధం మణి, పెనడం గురవయ్య, కుమార్, రాపూరు సుబ్రమణ్యం,రాధమ్మ, ఈశ్వరయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సహకారం సంఘంలో చలివేంద్రం ప్రారంభం

తొట్టంబేడు, మే 5 ప్రభాతవార్త: మండలంలోని తంగేళ్ళపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నెం.580లో సోమవారం సిఈఓ చిరంజీవిరెడ్డి, పిఏసి పి.రవిబాబుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సిఈవో చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, రైతులకు సహకార సంఘం ఆధ్వర్యంలో చల్లని తాగునీటిని ఏర్పాటు చేశామని చల్లని నీటికోసం ఫ్రిజ్‌నీళ్ళకన్నా మట్టికుండలో నీళ్ళు ఎంతో బాగుంటాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామాల్లో గంగజాతర వేడుకలు

నారాయణవనం, మే 5 ప్రభాతవార్త : మండలంలోని భీమునిచెరువు, కశింమిట్ట, వెత్తలతడుకు, జిఎన్.కండ్రిగ, నాగిలేరు గ్రామాల్లో మంగళవారం నుంచి గంగజాతర వేడుకలు ఘనంగా ప్రారంభంకా నుంది. గంగమ్మ అమ్మవారి ఆలయాలను సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. గంగమ్మ ఆలయాల ఎదుట చలువపందేళ్లు, విద్యుత్‌దీపాలంకరణ, తోరణాలు, పచ్చనివేపాకు తోరణాలను కడుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మొదటిరోజు రాత్రి అమ్మవారిని ట్రాక్టర్‌పై ఊరేగించడం, రెండవరోజు రాత్రి అమ్మవారి నిజమజ్జనం, పాటకచ్చేరి, మూడవరోజు భక్తులు ముళ్లుగుచ్చుట, వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనుంది.

## నగరి తహసీల్దార్‌గా కిరణ్



విజయపురం, మే 5 ప్రభాతవార్త: విజయపురం తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎస్.కిరణ్ సోమవారం నగరి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి పరిధిలోని భూ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని అన్నారు. పలువురు కార్యాలయ అధికారులు సిబ్బంది ఆయనకి స్వాగతం పలికారు.

## మండల సముదాయ భూమిలో పెద్ద ఎత్తున గుడిసెలు

### -పట్టించుకోని రెవెన్యూ అధికారులు



బుచ్చినాయుడు కండ్రిగ, మే 5 ప్రభాతవార్త: బుచ్చినాయుడు కండ్రిగ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఎదుట విలువైన ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెలు వేసి ఆక్రమించుకుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తూ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. మండల సముదాయంలోని సర్వే నెం.252,253, 254లలోసుమారు 5 ఎకరాల భూమి కోట్ల రూపాయలు విలువ చేస్తుంది. ఈ భూమిలో కనమనంబేడు గ్రామ దళితులు ఇంటిస్థలాల కొరకు సుమారు 39 రోజులు రిలే నిరాహారదీక్షలు చేపట్టరు. తహసీల్దార్ శ్రీదేవి తన రెవెన్యూ బృందంతో కనమనంబేడు గ్రామంలో ఇంటి గుర్తించే విధంగా చర్యలు చేపట్టారు. నిరాహారదీక్ష విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం దీక్ష చేస్తున్న దళితుల దగ్గరకు వచ్చి అర్హులందరికి ఇంటిపట్టాలు ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ప్రభుత్వం త్వరలో ఇంటిస్థలాల మంజూరుకు జీవో విడుదల చేస్తుందని జీవో రాగానే అర్హులందరికి స్థలాలు ఇస్తామని హామీ ఇవ్వడంతో దళితులు దీక్షలు విరమించారు. అయితే అర్హుల కోసం ఇంటింటా సర్వే చేసిన రెవెన్యూ అధికారులు సర్వేలో ఇంటి స్థలాలకు అర్హులు లేరని, దళితులు కోరే భూమి మండల సముదాయంకు కేటాయించిన భూమి అని, వ్యక్తిత్వంగా దళితులకు నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీని బేఖాతర్ చేస్తూ నాలుగు రోజుల క్రితం దళితులు పెద్ద ఎత్తున గుడిసెలు వేశారు. రెవెన్యూ అధికారులు తొలగించాలని దళితులను కోరినా వారు పట్టించుకోలేదు. కోట్లాది విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్‌ని వివరణ కోరగాప్రభుత్వ భూమిని ఆక్రమించి దళితులు గుడిసెలు వేశారని, ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఉన్నా మండల సముదాయంకు కేటాయించిన భూమి ఆక్రమించారని, తెలిపారు. ఆక్రమణలను అడ్డుకోవాలని ప్రయత్నించినా దళితులు పట్టించుకోలేదని, దీంతో భూమి ఆక్రమణపై పలువురిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

## మండల ఎంపీడీవోగా మాలతి బాధ్యతలు



కేవీబీ పురం, మే 5 ప్రభాతవార్త: కేవీబీపురం మండల ఎంపీడీవోగా వి.బి. మాలతి బాధ్యతలు చేపట్టారు. అధికారుల బదిలీ ప్రక్రియ కొనసాగిన నేపథ్యంలో ఎర్రవారిపాళెం ఎంపీడీవో కార్యాలయ ంలో ఏవోగా ఉన్న మాలతి రెగ్యులర్ ఎంపీడీవోగా ప్రమోషన్ మీద కేవీబీ పురం మండల ఎంపీడీవోగా మొదటి సారి బాధ్యతలు చేపట్టారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రతి శాఖలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనులను పర్యవేక్షించి ప్రజలకు ఉపయోగకరంగా అన్ని శాఖలు పనిచేయుటకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వేసవి దృష్ట్యా మండలంలో తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

## లోకేష్ బాబు రాక ...
## సత్యవేడు నాయకులో ఉత్కంఠ

సత్యవేడు, మే 5 ప్రభాతవార్త: టీడీపీ యువనేత రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం సత్యవేడులో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక వీఎంకే కల్యాణ మండపం వద్ద నాయకులు, కార్యకర్తలతో మంత్రి కీలక సమావేశం జరపున్నారు. టీడీపీ ప్రతిక్షంలో ఉన్నప్పుడు సత్యవేడు నియోజకవర్గంలో జరిగిన పార్టీ కార్యక్రమాలు, అధిష్టానం ఇచ్చిన పిలుపుకు ఆయా మండలాల నుంచి వచ్చిన స్పందన, అప్పట్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తల పాత్ర వంటి విషయాలను కూడా గుర్తించి ఆ మేరకు చర్చించనున్నారని సమాచారం. పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదినడుస్తున్నప్పటికీ పార్టీ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కొన్ని ఇబ్బందులు తప్పడంలేదు. ఈ అంశం కూడా తీవ్రంగా పరిగణించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారని తెలుస్తోంది, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించే సమావేశంలో నియోజకర్గంలో పార్టీ ప్రతిష్టత, బలోపేత చర్యలపై కూడా కీలక ఆదేశాలు అందుతాయని తెలుస్తోంది. ఏదీ ఏమైనా సత్యవేడు టీడీపీకి మంత్రి లోకేష్ ప్రత్యేక శస్త్ర చికిత్సలు జరపడం తథ్యమని నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

## మీరందరూ సహకరిస్తే...ఆదర్శవంతమైన అభివృద్ధి చేద్దాం

### -ఎంపిపి, వైస్ ఎంపిపిలపై ఎమ్మెల్యే నాని



తిరుపతిరూరల్, మే 5 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు సహకారం అందిస్తే మండలాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సోమవారం తిరుపతిరూరల్ మండల సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ తిరుపతిరూరల్ మండలంలో 2021లో వరదలకు కొట్టుకుపోయిన తిరుచానూరు, తనపల్లి, చిగురువాడ బ్రిడ్జిలను రూ.84కోట్ల రుపా యాలతో నూతనంగా నిర్మించుటకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తిరుపతిఅర్బన్ పంచాయతీలైన సప్తగిరి కాలనీ, మంగళం, రణధీరపురం, తిరుమలనగర్, శెట్టిపల్లి గ్రామ పంచాయతీలలో అభివృద్ధికి విపక్షనాయకులు అడ్డుపడుతున్నారని, వారికి స్థానిక అధికారులు సహకరించి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తే అధికారులపై చర్యలు తీసుకొంటానని హెచ్చరించారు. మండలంలో అపార్టుమెంట్ సంస్కృతి ఎక్కువైనందున మౌళిక సదుపాయాలు కల్పించడంలో విఫలమైతున్నామని అధికారులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే సమాధానం ఇస్తూ...ఈ సారి జరగబోయే సర్వసభ్య సమావేశానికి తుడ అధికారులను కూడా పిలిపించి, సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలో ఇప్పటివరకు కోట్లరుపాయాలతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. దాదాపు అన్ని గ్రామ పంచాయతీలకు ఎన్ఆర్ఇజి ఎస్ నిధులు ద్వారా సి.సి.రోడ్లు నిర్మాణం చేసినట్లు తెలిపారు. మండలంలోని సమస్యలను అధికారులను ప్రజాప్రతినిధులను, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలో 59 అభివృద్ధి పనులకు సుమారు రూ 2కోట్ల 23లక్షల 45వేల రుపాయాలతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు ఎమ్మెల్యే వివరించారు. స్వర్ణముఖి నదీపరివాహక ప్రాంతంలో అక్రమ లేవుట్, కట్టడాలు గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయంలో దాదాపు 350 ఎకరాలు స్వర్ణముఖి నదీపరివాహక ప్రాంతం అన్యాక్రాంతమైనట్లు తెలిపారు. సి.మల్లవరం గ్రామ పంచాయతీలో పట్టాభూమిలో పశువుల తొట్టే నిర్మాణంపై సంభాషణ జరుగుతుండగా దానిపై వైస్ ఎంపిపి కలగజేసుకోవడాన్ని ఎమ్మెల్యే విభేధించాడు. అలాగే ఎంపిపి చంద్రమోహన్‌రెడ్డి అధికారులను బేదిరించే ధోరణి మానుకోవాలని, అధికారులను ఏవిధంగా పరిరక్షించుకోవాలో తనకు తెలుసునగా, నేను భేదిరించడం లేదని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాని ఎంపిపి వివరణ ఇవ్వగా, ఇద్దరిమధ్య కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం 'స్వశక్తి పంచాయతీ నేత్రికి అభియాన్' జాతీయ పురస్కారం అందుకున్న చెర్లోపల్లి సర్పంచ్ బొల్లినేని సుభాషిణి ఘనంగా సన్మానించారు. తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని, వేసవి దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలో పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గిందని, ఫెయిల్ శాతం పెరగటానికి కారణాలు ఎమిటని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. పేరూరు-తుమ్మలగుంట రోడ్డు పూర్తిస్థాయిలో మరమ్మత్తుకు గురైందని, నూతన రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు. వకుళమాత ఆలయానికి ఆర్టిసి బస్సులు నడపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ రామచంద్ర, జడ్పిటిసి రత్నమ్మ, వైస్ ఎంపిపిలు విదుదల మాధవరెడ్డి, యశోధ, తిరుపతి అర్బర్ తహశీల్దార్ భాగ్యలక్ష్మీ, రూరల్ తహశీల్థార్ రామాంజులునాయక్, ఇవోపిఆర్డి మాధురి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెయిన్స్ రాత పరీక్షకు 619 మంది హాజరు

తిరుపతి కలెక్టరేట్, మే 5 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో సోమవారం నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 619 మంది అభ్యర్థులు హాజరయ్యారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మొత్తం మీద 67.95 శాతం హాజరు కాగా 292 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

**పీజీఆర్ఎస్‌కు తగ్గిన అర్జీదారులు:**

తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు కేవలం 293 అర్జీలు మాత్రమే అందాయి. ప్రతి సోమవారం దాదాపు 300 నుంచి 500 వరకు ఫిర్యాదులు కలెక్టర్, డెప్యూటీ కలెక్టర్లు, డీఆర్వోలకు అందజేసే వారు.

## ఉర్దూ పాఠశాల కోసం కలెక్టర్ కార్యాలయానికి మైనార్టీలు



రేణిగుంట, మే 5 ప్రభాతవార్త : పట్టణంలోని ఉర్దూ పాఠశాలను కాపాడా లంటూ మైనార్టీ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకుని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర కు వినతిపత్రం సమర్పించారు. రేణిగుంట గుంటకట్ట వద్ద ఉర్దూ పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం అప్పటి మంత్రి దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దాదాపు 26లక్షల రూపాయలు నిధులు మంజూరు చేయించారని అన్నారు. ఉర్దూ పాఠశాలలో గతం నందు 70 మంది విద్యార్థులతో ఎనిమిదో తరగతి వరకు విద్యాబోధన జరిగేదని తెలిపారు. విద్యార్థుల సంఖ్య కొద్దిగా తగ్గడంతో విద్యార్థులను పక్కనే ఉన్న ఆదర్శ పాఠశాలకు బదిలీ చేసే యోచనలో ఉన్నారని తద్వారా పాఠశాల మూతపడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈ మేరకు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మైనార్టీ నాయకులు మాజీ సర్పంచ్ జీకే మునీర్, ముస్లిం మత పెద్దలు నయాబ్ రసూల్, షేక్ ఖాసిం పీరా, మహమ్మద్ రహమతుల్లా, మహబూబ్బాషా, ఖలీల్ సాహెబ్, పేష్మ, అఫ్రాఫ్ అలీ, అఫ్రోజ్ , తదితరులు ఉన్నారు.

## మహిళలు అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన అజెండా : బొజ్జల



రేణిగుంట, మే 5 ప్రభాతవార్త : మహిళలు అభివృద్ధి చెందలమే ఎన్డీఏ ప్రభుత్వ ప్రధాన ఎజెండా అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. రేణిగుంట మండలం గుత్తివారిపల్లె గ్రామంలో మహిళా సాధికారిక కోసం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సోమవారం ఈజీ మార్ట్ గోడౌన్ ప్రారంభించారు. ఆన్లైన్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు తమకు కావలసిన నాణ్యమైన రేషన్ సరుకులను సరసమైన ధరలకు డ్వాక్రా సంఘాలు, మహిళా సమైక్య ద్వారా లభించే అవకాశాలు ఈజీ మార్ట్ ద్వారా లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కో ఫౌండర్ బోస్ నల్లపాటి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, టిడిపి జిల్లా నాయకులు మున్సిపల్ నాయుడు, టిడిపి నేత మాజీ గాజులమండ్యం సర్పంచ్ శ్రీ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత అంబులెన్స్ మార్చురీ సేవలు



తిరుపతి విద్య, మే 5 ప్రభాతవార్త : ప్రణీత్ ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత అంబులెన్స్ మార్చురీ సేవలు అభినందనీయం అని టిటిడి అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుపతిలో స్థానికంగా ఉన్న స్వీకార్ (టాటా క్యాన్సర్ హాస్పటల్) వారి మూడవ వార్షిక మహోత్సవంలో ప్రణీత్ ఫౌండేషన్ వారు అందిస్తున్న ఉచిత అంబులెన్స్ మార్చురీ సేవలను ప్రశంసించారు. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రణీత్ పెనుమాడును టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, ఐజర్ డైరెక్టర్ ఆచార్య సంతాను భట్టాచార్య, ఐఐటి డైరెక్టర్ ఆచార్య కెఎన్ సత్యనారాయణ, టాటా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ శర్మ ప్రశంసిస్తూ జ్ఞాపికను అందజేశారు.

## మోడీకి కృతజ్ఞతలు తెలిపిన నారాయణ గౌడ్..

తిరుపతి విద్య, మే 5 ప్రభాతవార్త : జనగణనతో పాటు కులగణన చేపడతామని ప్రధాని నరేంద్ర మోడీ రెండు రోజుల క్రితం ప్రకటించడం శుభ పరిణామమని ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణగౌడ్ తెలిపారు. గౌడ్ మాట్లాడుతూ రిజర్వేషన్ ఫలాలు జనాభా కనుగుణంగా అందడం లేదని ఈ దేశంలో పులులకు సింహాలకు,లెక్కలు ఉన్నాయి. కానీ మేధాశక్తి కలిగిన మనుషులకు ఏ కులం వారు ఎంత శాతం జనాభా ఉన్నారో తెలియకపోవడం బాధాకరమన్నారు.

**లా పరీక్షా కేంద్రాలను పరిశీలించిన యస్వీయూ ఉపకులపతి:**

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బి.ఎల్.మూడవ సెమిస్టర్ పరీక్షల తీరును విసి ఆచార్య అప్పారావు స్వయంగా పరిశీలించారు. అంజిమేడులోని ఈశ్వర్‌రెడ్డి లా కళాశాలలో మూడవ సెమిస్టర్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా వారు తనిఖీ చేశారు. అక్కడ ఒకరిని మాల్ ప్రాక్టీస్ కింద నమోదు చేయడాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ అనుమతించవద్దని పరిశీలకులను ఆదేశించారు.

## మాజీ ఎంఎల్ఏచే ఓదార్పు



శ్రీకాళహస్తి,మే 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని పీర్లచావిడి వీధిలో అనారోగ్యంతో మృతి చెందిన చంద్రశేఖర్ కుటుంబాన్ని సోమవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహచరులతో కలసి పరామర్శించారు. పార్టీకి మద్దతుదారుడుగా ఉన్న కలపాటి చంద్రశేఖర్ అనారోగ్యంతో మరణించారు. పార్థివ దేహానికి బియ్యపు మధుసూధనరెడ్డి పూల మాలలువేసి సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి నివాళులర్పించారు. మాజీ ఎంఎల్ఏతో పాటు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సాదన మునస్వామి రాయల్, శ్రీవారి సురేష్, ఉత్తరాధి శరవణ కుమార్ కంఠా ఉదయ్‌కుమార్, విజయకుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## ఆలయ భూములు ఆక్రమణలపై అధికారుల మౌనం

### ఆక్రమించిన ఆర్ఎంపి, అడ్డుకున్న ఆటో యూనియన్ - ఆటో వర్సస్ ఆర్ఎంపి



శ్రీకాళహస్తి,మే 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని ఆస్తులకు రక్షణ కరువైంది. ఓ వైపు కైలాసగిరుల్లో భూములు అప్పనంగా కొందరు ఆక్రమించు కుంటున్నారు. పట్టణ నడిబొడ్డులోని తేరువీధిలో ఇటీవల ఓ స్థలంలో షెడ్డు నిర్మాణానికి ప్రయత్నించగా, సోమవారం మరో వివాదం చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరు నికి సమీపంలో ఓ కట్టడం జరుగుతుంటే శివయ్యయే కాదు అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. దేవుని ఆస్తులను పరిరక్షించాల్సి న పాలకులు అభయమివ్వటంతో శివయ్య ఆస్తుల పరిరక్షణ గాలిలో దీపంగా మారింది. సోమవారం సన్నిదివీధి శ్రీరామమందిరం వద్ద కబ్జా వ్యవహారం 'ఆటో వర్సస్ ఆర్ఎంపి' డాక్టర్‌గా చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తి నడిబొడ్డులో శ్రీరామమందిరం పక్కన భక్తుల సదుపాయాలకు గదులు, బాత్‌రూంలు ఉన్నాయి. దాని పక్కన కొంత ఖాళీ స్థలం, ఇక్కడ ఆటో యూనియన్‌కు స్టాండ్‌కు నాయకుడు భరోసా ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే ఈ ఖాళీ స్థలంలో క్లీనిక్ ఏర్పాటుకు నాయకుడు అనుమతించినట్లు మూడు రోజులుగా పనులు చేసుకుంటుండగా ఆటో యూనియన్ అభ్యంతరం చెప్పినట్లు సమాచారం దాంతో వివాదం చోటు చేసుకుంది. ఆటోయూనియన్ అభ్యంతరం చెప్పటంతో ఆక్రమణ ఆగింది. ఆర్ఎంపి డాక్టర్ శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేస్తున్నారు. ఆయన దేవస్థానం స్థలంలో భవన నిర్మాణానికి పూనుకోవటంతో చర్చనీయాంశంగా మారింది. అయితే కూత వేటు దూరంలో ఉన్న ఆలయ భూములు ఆక్రమణలకు అక్రమ కట్టడాలకు పూనుకుంటుంటే కనీసం తిరిగి చూడలేదంటే అధికారులు చిత్తశుద్ధిపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అయితే ఆర్ఎంపి డాక్టర్ దేవస్థానం ఇఓ,కమిషనర్ అనుమతించారంటూ చెబుతున్నారు. మరి ఎవరు ఎవరికి అనుమతిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. దేవుని సొత్తును ఎవరికి వారు ఆక్రమించుకుంటుంటే మాకేం సంబంధం అన్నట్లు వ్యవహరించటం ప్రశ్నార్థకంగా మారింది.

## అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రన్నతోనే సాధ్యం : ఎమ్మెల్యే





నారాయణవనం, మే 5 ప్రభాతవార్త : గ్రామాల సమగ్ర అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీలోని అరణ్యంకండ్రిగ గ్రామంలో జాతీయ గ్రామీణా ఉపాధిహామి పథకం ద్వారా నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. అలాగే గ్రామంలో నిర్మించి వెల్‌నేస్ సెంటర్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపు పల్లెల్లో అభివృద్ధి పనులను వేగవంతంగా జరుగుతున్నట్టు చెప్పారు. భవిష్యత్తుల్లో చంద్రన్న సూపర్ సిక్స్ పథకాల అమలుతోనే సంక్షేమం, అభివృద్ధి ఊపందు కుంటుందన్నారు. మాజీ ఎంపిపిలు పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, మాజీ సర్పంచ్ నర్రవుల కందస్వామినాయుడు, కెఎస్‌రవిరెడ్డి, ఎ జయచంద్రనాయుడు, బాలచంద్రనాయుడు, సర్పంచ్ మురళి, తహశీల్దారు జయరాములు, ఎంపిడిఓ గుణశేఖర్, డాక్టర్లు దర్శిత్‌రాజ్, రాగసుధ, కుమార్, భార్గవి, ఇజిఎస్ ఎపిఓ సుకన్య, పంచాయతీ రాజ్ ఎఇ నరేష్, నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



నారాయణవనం, మే 5 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 11నుంచివ తేది వరకు వతేది నుంచి 19వ తేది వరకు నిర్వహించడం జరగనుంది, టిటిడి జెఇఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఇఓ నాగరత్నలు తెలిపారు. తిరుపతిలో పరిపాలన భవనంలో సోమవారం బ్రహ్మోత్సవ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ప్రతి రోజు ఉదయం 7.30నుంచి9.30గంటల వరకు వాహనసేవలు వుంటుందన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6నుంచి7గంటల మధ్య ఊంజల్‌సేవ, కళ్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు 1000 రూపాయాలను ముందుగానే చెల్లించాలని కోరారు. ప్రతిరోజు టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో సాంస్కృతిక, భక్తి సంగీత, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగనుంది. ఈ కార్యక్రమంలో ఎఇఓ రవి, అర్చకులు పాల్గొన్నారు.

## మృత్యుంజయునికి అభిషేకాలు



శ్రీకాళహస్తి, మే 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుం జయ స్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు, అలంకారాలు నిర్వహించారు. స్వామికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాలకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## గాంధీపురం గ్రామ పంచాయతీలో నీటి సంపు పునరుద్ధరణ

తిరుపతిరూరల్, మే5 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ పరిధిలో నిరుపయోగంగా ఉన్న నీటి సంపు పునరుద్ధరణను సోమవారం ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా నీటి సమస్య ఉన్నా...గత వైసిపి పాలకులు పట్టించుకోలేదని స్థానికులు తెలపగా ఎమ్మెల్యే నాని స్పందించి పరిసర ప్రాంత పంచాయతీలకు నీటి సరఫరా కొరకు సంపును పునరుద్దరించినట్లు తెలిపారు. 20లక్షల రుపాయాలతో 2లక్షల నీటి నిల్వ చేసే సంపును మరమ్మత్తు చేసి, ఆరు గ్రామ పంచాయతీలకు నీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రామ్మోహన్, జడ్పిసిఇవో రవికుమార్‌నాయుడు, డిపిఓ సుశీలాదేవి, అవిలాల గ్రామ సర్పంచ్ చెందెలి వెంకటరమణ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి విజయకుమార్, ఎంపిడిఓ రామచంద్ర, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులు కండక్టర్లకు సహకరించాలి



సత్యవేడు, మే 5 ప్రభాతవార్త: ప్రయాణికులు కండక్టర్లకు సహకరించాలని, ప్రయాణికులే టికెట్ తీసుకోవాలని సత్యవేడు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో సెక్రెటరీ వి.బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యల సాధన కోసం అసోసియేషన్ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ డిపోలో విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పించాల న్నారు. ఈ మేరకు వినతిపత్రాన్ని ఎన్ఎంయూ నాయకులు పలువురు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ త్యాగరాజుకు అందించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు పార్థసారథి, గ్యారేజీ అధ్యక్షుడు కుప్పయ్య, సీసీఎస్ డెలిగేట్ సురేష్, జాయింట్ సెక్రటరీ ఎంఆర్ రవి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపిటిఎఫ్‌చే నిరసన కార్యక్రమం



తొట్టంబేడు, మే 5 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ప్రభుత్వ పాఠశాలల సంరక్షణకు కోసం మరియు ప్రభుత్వ అసంబద్ధవిధానాలపై శ్రీకాళహస్తితాలూకా కేంద్రమైన తహశీల్దార్ కార్యాలం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో దాదాపు 100మంది ఏపిఎఫ్ కార్యకర్తలు హాజరై నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మండల తహశీల్దార్ డి.లక్ష్మినారాయణకు మెమోరాండం సమర్పించడం జరిగింది. కార్యక్రమంలో ఏపిటిఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు బి.మురళీకృష్ణ, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు పి.వి.సుబ్బారెడ్డి, నేషన్ మజ్దూర్ యూనియన్ శ్రీకాళహస్తి అర్బన్ నాయకులు శేఖర్ తదితర నాయకులతో హాజరై ఉద్యమానికి మద్దతు తెలిపారు. శ్రీకాళహస్తి టౌన్, రూరల్, పెళ్ళకూరు. తొట్టంబేడు, కెవిబిపురం, బిఎన్‌కండ్రిగ, వరదయ్యపాలెం మండలాల ఏపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహిళా ఉపాధ్యాయినులు ఎ.భువనేశ్వరి, కె.నీరజమ్మ, ఎన్.జ్యోతి, ఆర్.లక్ష్మమ్మ, పి.సుమలత, లక్ష్మి, ఆర్.గోపాల్, లక్ష్మి ప్రసాద్, శ్రీహరి, సురేష్‌బాబు, వెంకట య్య, రామదాసు, చెంచురాజు కార్యకర్తలు మరియు సీనియర్ ఉపాధ్యాయులు విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆరాధన మహోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ



సూళ్లూరుపేట, మే 5 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని జీఎన్‌టి రోడ్డులో వెలసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు మహోత్సవ కమిటీ అధ్యక్షులు చిట్టేటి పెరుమాళ్లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆరాధన మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రిక, కరపత్రాలు ఆవిష్కరించారు. మహదేవయ్య నగర్‌లో వెలసి ఉన్న బ్రహ్మంగారి మఠంలో ఈ కార్యక్రమాలను 332వ పర్వదిన మహోత్సవాలుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 7వ తేదీ గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమై 8వ తేదీన స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, 9వ తేదీ అభిషేకం, హోమం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మూడురోజులు పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఆరాదన మహోత్స వాలను విజయవంతం చేయాలని చిట్టేటి పెరుమాళ్లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బట్టా సుబ్రహ్మణ్య యాదవ్, వేమన బోయిన చెంగయ్య యాదవ్, సిహెచ్ రాందాసు, గజేంద్ర, మెస్ రమణయ్య, ఎ.మునికృష్ణయ్య, అర్చకులు భాస్కర శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమా లకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి హాజరవుతారని పెరుమాళ్లు తెలిపారు.

## ఉపాధ్యాయుల ధర్నా



సూళ్లూరుపేట, మే 5 ప్రభాతవార్త: ఎపిటిఎఫ్ పిలుపు మేరకు సూళ్లూరుపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ హేతు బద్ధీకరణ పేరుతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చేసే సమయంలో బేసిక్ పాఠశాలలను పరిరక్షించాలని, యూపి స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగిం చాలని డిమాండ్ చేశారు. 117 జిఓను రద్దు చేయాలని కోరారు. తడ మండల తీరప్రాంతాల్లో బివిపాలెం, వేనాడు పాఠశాలల్లో ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని కోరారు. 12వ పిఆర్‌సి కమిషన్ వెంటనే వేయాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే డిఎ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఉస్మాన్‌బాషా, గోపినాథ్, సుధాకర్‌రెడ్డి, రమణయ్య, సుజన్, రఘురామయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామ శక్తి గ్రామోత్సవం



చిట్టమూరు, మే 5 ప్రభాతవార్త : మండల పరిధిలోని పెద్ద దరఖాస్తు గ్రామంలో ఘనంగా ఎల్లసీరమ్మ గ్రామోత్సవం జరిగింది. ఆదివారం గ్రామ శక్తి ఎల్లసిరి అమ్మకు పొంగళ్ళు, నైవేద్యాలు అర్పించిన గ్రామస్తులు సోమవారం గ్రామ శక్తి అమ్మవారిని అంగరంగ వైభవంగా భారీ లైటింగ్లతో గ్రామంలో ఊరేగించారు. దరఖాస్తు చెరువు కట్టపై ఇటీవలే నూతనంగా నిర్మించిన గ్రామ శక్తి ఆలయాన్ని భక్తిశ్రద్ధలతో విగ్రహాన్ని నిర్మించి ఆరు రోజులు పాటు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపిన ప్రముఖ శిల్పి సిద్ధాంతి ఈపూరు గోవిందరాజులు ఆచారి గ్రామ సరిహద్దుల్లో హద్దురాళ్ళు ఏర్పరిచారు. ఎన్నో సంవత్సరాల తర్వాత పెద్ద దరఖాస్తు గ్రామంలో గ్రామ శక్తి ఎల్లసిరమ్మ ఉత్సవాలను తిలకించేందుకు మండల్ ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

## అధికారులను ధిక్కరించి హెచ్చరిక బోర్డు తొలగింపు



చిట్టమూరు,మే 5 ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆరూరు పెద్ద దళితవాడలో పేదల ప్లాట్లు పై కన్నేసిన అక్రమార్కులు దర్జాగా ఆక్రమించుకుని అమ్ముకానికి పెడుతున్న విషయం తెలిసిందే . అయితే ఆరూరు గ్రామంలో జరుగుతున్న ఈ అక్రమ దందాను పసిగట్టిన గ్రామస్తులు విషయాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు విన్నవించు కుంటే వారు వచ్చి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం తదుపరి అక్రమార్కులు ఆ బోర్డులను పీకేసి యధాతధంగా తమ దందా కొనసాగిస్తున్నాను పరిపాటిగా మారింది . గత 30 సంవత్సరాల కింద ఆరూరు పెద్ద దళిత కాలనీలో ఎస్సీలకు ఎస్టీలకు కలిపి వేసిన లేఔట్ లో ఎస్టీలు కు కేటాయించిన 7 ప్లాట్లను దర్జాగా ఆక్రమించుకొని అధికారులకు సవాలు సవాల్ విసురుతున్నాడు. అయితే ఇటీవల కాలంలో అక్రమార్కుడి నీ రెవెన్యూ అధికారులు హెచ్చరించిన తన ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు . అయితే తాసిల్దార్ మారిన ప్రతిసారి హెచ్చరిక బోర్డులను పెకిలించి ప్రభుత్వ భూములను అంగట్లో వేలం వేస్తున్న పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఏర్పర్చిన స్టాండర్డ్ హెచ్చరిక బోర్డులు కూడా పెరికి పక్కన పడేసి దర్జాగా అమ్మకానికి సిద్ధం చేస్తున్న వ్యక్తి పై అధికారులు స్పందించి తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో చోటు చేసుకుంటున్న ఈ అక్రమ దందాపై తాసిల్దారును వివరణ కోరగా వీఆర్వో ని పంపించి అతనిపై క్రిమినల్ కేసులు పెట్టి తగు చర్యలు తీసుకుంటామని ప్రభాతవార్తకు తెలియజేశారు

## ఆరుతడి పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చు



వెంకటగిరి, మే 5 ప్రభాతవార్త : ఆరుతడి పంటల ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో పెసర సాగు మీద శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు వరి కోసిన తర్వాత అరుతడి పంట గా పెసర సాగు చేసుకోవాలని, తద్వారా తక్కువ పంట కాలంలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు అని తెలిపారు. శాస్రవేత్త డా. రాజీవన పెసర సాగులో రకాలు, విత్తన మోతదు, విత్తన శుద్ధి, పోషక యాజమాన్యం, నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం, పురుగు తెగుళ్ల యాజమాన్యం గురుంచి వివరించడం జరిగింది. రైతులకు కొత్త రకాలు సాగు చేయాలని తద్వారా పల్లాకు తెగులు నివారించుకోవచ్చు అని, పల్లాకు తెగుల నివారణకు సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటించాలి అని తెలియజేసారు. రైతులు విత్తన శుద్ధి తప్పక చేయాలి అని రైతులకు కెవికె లో విత్తన శుద్ధి విధానం మీద ప్రదర్శన ఇవ్వడం జరిగింది. రైతులకు ఎల్ జి జి607 పెసర విత్తనాలు అందిచడం జరిగింది. రైతులు జిగురు అట్టలు వినియో గించాలని, జిగురు అట్టల వినియోగం మీద, కెవికె ఫార్మ్‌లో ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్రవేత్తలు విజయ శ్రీ, నాగార్జునరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## 14వ వార్డులో అధ్వానంగా పారిశుద్ధం కౌన్సిలర్

వెంకటగిరి, మే 5 ప్రభాతవార్త: 14వ వార్డులో పారిశుద్ధం అధ్వానంగా ఉరదని కౌన్సిలర్, ఆర్టిఏ విభాగం నియోజకవర్గ అధ్యక్షులు ఆరి శంకరయ్య తెలిపారు. మున్సిపాలిటి సుధర్శన్ నగర్ సచివాలయంలో 8 సోమవారం ప్రజా విజ్ఞప్తుల రోజు జరగడం జరిగినది. ఇందులో బాగంగా ప్రజాల దగ్గరనుండి అర్జీలు స్వీకరించారు. 14వ వార్డు కాశిపేట, నరసింహారావు వీధి, అరుంధతి వాడ, ధర్మాపురంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. 14వ వార్డు పరిదిలో, మున్సిపల్ కోర్టు, పెద్ద ఆసుపత్రి, పెద్ద పోస్టు ఆఫీసు, సబ్ రిజిస్టర్ ఆఫీసు ఉన్నవి. ఇంత పెద్ద ప్రాంతంకు కేవలం ఇద్దరు మాత్రమే పారిశుద్ధ్య కార్మికులు కలరు.

## ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి



వెంకటగిరి, మే 5 ప్రభాతవార్త : ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వెంకటగిరి డిపో కార్యదర్శి కే.వి.రత్నం కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ వెంకటగిరి డిపో కమిటీ ఆధ్వర్యంలో తాసిల్దార్ రాంబాబుకు ఎ.పి.పి.టి.డి. సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కొరకు మెమొరాండం సమర్పించడం జరిగినది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డిమాండ్లను పరిష్కరించాలని తాసిల్దారులు కోరారు. ఈ కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ వి.పి.రావు, ట్రెజర్ ఏ ఎమ్ . గురవయ్య, జాయింట్ సెక్రటరీ సుబ్బారావు, ఎన్ రియాజ్, సురేంద్ర, వెంకటేశ్వర్లు, కృష్ణా గ్యేరేజి ప్రెసిడెంట్ ఏ ఎం.రాజా,రవికుమార్, కృష్ణా, శివకుమార్ పాల్గొన్నారు.

## ఏపీ టీఎఫ్ నాయకులు నిరసన



గూడూరు, మే 5 ప్రభాతవార్త: పట్టణంలోని గ్రామ రెవెన్యూ సేవకుల భవనం ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి ఏపీ టీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు.వారు మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం విద్యారంగంలో గత ప్రభుత్వం అవలంబించిన విధానాలనే కొనసాగిస్తూ మరింత గందరగోళ పరిస్థితులను కల్పిస్తుందని ఏపీటీఎఫ్ నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు ఎన్ మోహన్ దాస్, జిల్లా నాయకులు వై సుబ్రహ్మణ్యం రాజు, చిల్లకూరు గూడూరు ఏపీటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాల కరపత్రాలు విడుదల



చిల్లకూరు, మే 5 ప్రభాతవార్త: మండలం కలవకొండ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మినరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 8వ తేదీ నుండి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని భక్తులందరూ పాల్గొనాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. సోమవారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ నివాసం వద్ద కలవకొండ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలు పోస్టర్స్‌ను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఫెస్టివల్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మినరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఫెస్టివల్ కమిటీని నియమించడం జరిగిందని తెలిపారు. గతంలో దేవాలయ అభివృద్ధికి సహకరించిన పెద్దలందరినీ పార్టీలకతీతంగా ఆహ్వానించి గౌరవించాలని కోరారు. బ్రహ్మోత్సవాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో రవికృష్ణ ,ఫెస్టివల్ కమిటీ ఛైర్మన్ చిరంజీవి, బాబి, తదితరులు పాల్గొన్నారు.

## భోజన ప్యాకెట్లు వితరణ



గూడూరు, మే 5 ప్రభాతవార్త : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నిరాశ్రయు లకు భోజన ప్యాకెట్లను తిరుమల శెట్టి నారాయణ పంపిణీ చేశారు. యల్లాప్రగడ సత్యనారాయణ రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా దత్త పుత్రుడైన తిరుమలశెట్టి నారాయణ చేతుల మీదుగా 402 మందికి భోజన ప్యాకెట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తండ్రి గారైన యల్లా ప్రగడ సత్యనారాయణ రావు ప్రథమ వర్ధంతి సందర్భంగా నిరాశ్రయులకు భోజన ప్యాకెట్లను అందజేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ కాలేషా, తూపిలి మహేష్, గుండాల ధనుంజయ, జనార్ధన్, కిషోర్ , గౌస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

గూడూరు, మే 5 ప్రభాతవార్త: గూడూరులోని త్యాగరాజావీధి శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ అండ్ ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికీ దాతగా పి. విరజ 5000 అందజేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ రోహిణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇంకా ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనూజ, కార్యదర్శి అనితా, శశి రేఖ, భవానీ ఇంకా రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, పల్లం వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు. అలాగే రెడ్ సంస్థ వికలాంగులకు ఎండలు ఎక్కువ ఉండడం వల్ల కొంతమందికి చెప్పులు కూడా లేనందున వారికి ఇన్నర్ వీల్ అండ్ ఆంధ్రా మహిళా మండలి తరుపున చెప్పులు కూడా పంపిణీ చేసారు.

## నాయుడుపేటలో పోలేరమ్మ హుండి లెక్కింపు



నాయుడుపేట, మే 5 ప్రభాతవార్త : నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవం సందర్భంగా దేవాదాయశాఖ ఈఓ రవికృష్ణ, జాతర కమిటి అధ్యక్షుడు నానభాల సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం పోలేరమ్మ హుండిలో నగదు లెక్కింపు కార్యక్రమం చేపట్టారు.ఈసందర్భంగా దేవాధాయశాఖ ఈఓ రవికృష్ణ మాట్లడుతూ నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మ జాతరను పురస్కరించుకొని హుండిలో నగదును లెక్కించడం జరిగిందన్నారు. అమ్మవారు హుండిలో రెండులక్షల ఇరవైతొమ్మిదివేల రెండువందల పదహారు రూపాయలు ఉన్నట్లు ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

5ఎన్‌పిటి01 పేటలో పోలేరమ్మ ఆలయం వద్ద హుండిలో నగదు లెక్కిస్తున్న దృశ్యం.

## మహిళల అభివృద్ధే మా ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



నాయుడుపేట, ఏప్రిల్ 5 ప్రభాతవార్త: రాష్ట్రంలో మహిళలను అన్నివిధాల అభివృద్ధి చేయడమే మా ప్రభుత్వ లక్ష్యమని సూళ్ళూరుపేట శాసన సభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు.ఆమె సోమవారం నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిమక్షణ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళలను అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషిచేస్తున్నారని తెలిపారు.రాష్ట్రంలో మహిళలకు వడ్డీలేని రుణాలు,ఉచిత కుట్టుమిషన్లు, అందజేయడం తెదేపా ప్రభుత్వనికే సాధ్యమౌతుం దన్నారు. మహిళలు ఉచిత కుట్టుమిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వంతంగా అభివృద్ధి చెందాలని సూచించారు.రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని సూచి ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేపడుతున్నాయని ఆమె తెలియజేశారు.ఈకార్యక్రమంలో మున్సిపాల్టి వైస్‌చేర్మేన్ 786రఫి, కమిషనర్ పజులుల్లా, దార్ల రాజేంద్ర,ఎస్‌జె రాజేష్,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, అక్రమార్జనపై బహిరంగ చర్చకు సిద్ధమా!

**- నిబంధనల ప్రకారమే కట్టమంచి చెరువులో పూడికమట్టి తొలగింపు**

**- చిత్తూరు నగర పరిధిలోని అన్ని చెరువుల్లో పూడిక తీత పనులు ప్రారంభిస్తాం**

**- ఈ పది నెలల్లో రూ.56.30 కోట్లు అభివృద్ధికి వెచ్చించాం**

**- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**



చిత్తూరురూరల్, మే 5 ప్రభాతవార్త: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన ఈ పది నెలల్లో చిత్తూరు నియోజకవర్గంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిపై, గత ఐదేళ్ళ వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం, అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమార్జనలపై బహిరంగ చర్చకు సిద్ధమా! అని వైకాపా నాయకులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సవాల్ విసిరారు. చిత్తూరు కట్టమంచి చెరువు నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, దౌర్జనాలకు పాల్పడుతున్నారని వైకాపా నాయకులు ఆరోపిస్తుండటం, కొన్ని పత్రికల్లో వార్తలు రావడంపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు స్పందించి సోమవారం చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు, జిల్లా తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ, చంద్రప్రకాష్, మేయర్ అముద, డిప్యుటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డిలతో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో భూగర్భజలాలు పెంచడం, కట్టమంచి చెరువు కట్టను పటిష్టం చేసి సుందరీకరణ చేయాలనే ఉద్దేశంతో అక్కడ పూడిక పనులు చేస్తున్నామ న్నారు. అదేదో అక్రమంగా మట్టిని తరలించి డబ్బులు దండుకుంటున్నారని కొంతమంది పనికట్టుకుని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్టీఆర్ జలాశయం నుండి కట్టమంచి చెరువుకు నీటిని తరలించాలనే భావనతో ఆరు నెలల క్రితం స్వయంగా కలెక్టర్ చెరువులో పూడిక తీత పనులు ప్రారంభించా రన్నారు. వర్షాలు రావడం, చెరువులో నీటి మట్టం వుండటం కారణంతో పనులు ఆలస్యం అయ్యాయన్నారు. చెరువులో పూడిక పూడిపోయి కాలువల కంటే ఎత్తుగా వుండటంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందని, ఈ పరిస్థితుల్లో చెరువులో వీలైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలని నిర్ణయించి ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణతోనే చెరువులో పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరిగితే చిత్తూరు నగర పురపాలిక సంస్థ పరిధిలో సుమారు 480కి పైగా బోర్లలో నీరు రీ ఛార్జ్ అవుతుందని, ప్రజల నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఉద్దేశంతో పూడిక తీత పనులు చేస్తుంటే వాస్తవాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. అలాగే చిత్తూరు మున్సిపల్ పాత బస్టాండ్‌ను మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బస్టాండ్, షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే చిత్తూరు పివికెఎన్ డిగ్రీ కళాశాలలో మౌళిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, ఈ కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్ళడానికి అవసరమైన అన్ని చర్యలు కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇటీవల రాజస్థాన్‌లోని ఓ యూనివర్సిటీని వెళ్ళి పరిశీలించడం జరిగిందని, మరో నాలుగైదు యూనివర్సిటీలను పరిశీలించి చిత్తూరుకు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, జిల్లా తెలుగు యువత నాయకుడు వసంతకుమార్, అశోక్, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీపీజీసెట్ దరఖాస్తుల గడవు పొడిగింపు

తిరుపతి విద్య, మే 5 ప్రభాతవార్త: రాష్ట్రంలోని 17 యూనివర్సిటీలలో ఎంఎ,ఎంకామ్,ఎమ్మెస్సీ వంటి పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీపీజీసెట్2025 దరఖాస్తుల స్వీకరణ గడువు తేదీని ఈనెల 11 వరకు పొడిగించినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పీజీసెట్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీపీజీసెట్ గడువు సోమవారంతో ముగిసిందని,రాష్ట్రంలో ఇంకా కొన్ని కాళాశాలలో డిగ్రీ పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థుల అభ్యర్ధన మేరకు గడువు పొడిగింపుపై పీజీసెట్ ఛైర్మన్ అప్పారావు ఏపీ ఉన్నత విద్యామండలిని కోరారని తెలిపారు. దీంతో విద్యార్థుల సౌకర్యార్థం ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 11వరకు గడువు పొడిగించడం జరిగిందని చెప్పారు. రూ.1000ల అపరాధ రుసుముతో ఈనెల 15వరకు,రూ.2వేల అపరాధ రుసుముతో ఈనెల 20 వరకు, రూ.4వేల అపరాధ రుసుముతో 24వతేదీ వరకు,రూ.10వేల అపరాధరుసుముతో ఈనెల 25వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు ఏపీపీజీసెట్2025కు 153 విభాగాలలోని పీజీ కోర్సుల ప్రవేశాలకు 22వేలకు పైగా ధరఖాస్తులు అందాయని తెలియజేశారు.ఈ సంఖ్య దరఖాస్తుల గడువు ముగిసేనాటికి 30వేలు దాటవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాల్లో 35 పరీక్షా కేంద్రాలలో జూన్ 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

# గూడూరు డివిజన్

## సర్వోత్తమరెడ్డి రాజీనామా ఉపసంహరణ

**- ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**



కోట, మే 5 ప్రభాతవార్త : మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం కోటలోని సర్వోత్తమరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కోట మండలంలో కార్యకర్తలకు అండగా నిలబడి కష్టపడి పనిచేశారని గుర్తు చేశారు. అలాంటి వారిని తెలుగుదేశం పార్టీ వదులుకోదని స్పష్టం చేశారు. పార్టీకి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. పార్టీ అనేది కుటుంబం లాంటిదని, చిన్నపాటి మనస్పర్ధలు వస్తుంటాయని వాటిని ఎవరూ పట్టించుకోవద్దన్నారు. తనకు ఆరోగ్యం బాగ లేప్పుడు ఈ సంఘటన జరిగిందని చెప్పారు. ఎవరికి ఎకష్టం వచ్చినా తనకు చెప్పుకోవచ్చున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్ల తెదేపా జెండా ఎగరలాని కోరారు. గూడూరు డిజవిన్ పరిశ్రమల హబ్‌గా మారిపోతొదన్నారు. ఇప్పటికి అనేక పరిశ్రమలు వచ్చాయని పేర్కొన్నారు. పది నెలల కాలంలో తెలుగుదేశం పార్టీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిందని చెప్పారు.తాను వేల కోట్లు రూపాయలు సంపాదించినని కొందరు అవాస్తావాలు రాశారని చెప్పారు. తను ఎవరి వద్ద ఒక పైసా కూడా తీసుకోలేదని చెప్పారు. తెలుగుదేశం పార్టీ పేదల పార్టీని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చిల్లకూరు ధశరాధరామిరెడ్డి,జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్అహ్మద్, నెల్లూరు మోహన్‌రెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డితీగల సురేష్‌బాబు వెంకన్నపాలెం సర్పంచ్ మదుయాదవ్, మస్తాన్‌బాషా, ఎంపిటిసిలు షంషుద్దిన్, దారా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలు

**- చివరిరోజుల స్థానిక కళాకారుల ప్రదర్శనలు**



తడ, మే 5 ప్రభాతవార్త: తడ మండలం వాటంబేడుకుప్పంలో శ్రీధర్మరాజుల స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు భారతంలోని 18వ పర్వం ముఖ్య ఘట్టంగా ఉంది. ధర్మరాజుల పట్టాభిషేకం, శయన సేవతో పాటు గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాటంబేడు కుప్పానికి చెందిన రాయపురం అంకయ్య బృందంచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, వీధి భాగవతాలు ఏర్పాటు చేశారు. గత నెల 23న ధ్వజారోహణంతో మొదలైన పంచపాండవ ద్రౌపతి సమేత ధర్మరాజుల స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు సోమవారంతో అత్యంత వైభవంగా ముగిశాయి. తెలుగు, తమిళ సాంప్రదాయాలతో మహాభారతాన్ని ప్రతిరోజు కళ్లకు కట్టినట్లు చూపించారు. సుమారు 25 ఏళ్ల తర్వాత ఈ ఉత్సవాలు పులికాట్ సరస్సులో సందడి చేయడంతో పాటు వివిధ జాలర్ల కుప్పాల వారికి వినోదాలు పంచిపెట్టాయి. తమిళ, తెలుగు కళాకారులు ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయాన్ని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ ముఖ్య కార్యనిర్వాహకులుగా బొమ్మన్ పళణి, గ్రామపెద్దలు శ్రీధర్, గంగాధరం, గురునాథం, మాణిక్యం, షణ్ముగం, జయరామయ్య, ధనంజయ, ఏకాంబరం, ఎంపిటిసి కారికాటి మునెమ్మ, సర్పంచ్ వల్లూరు మహాలక్ష్మి, ఇతర పంచాయతీ ప్రముఖులు, వాటంబేడు కుప్పం యువకులు ఈ ఉత్సవాల నిర్వహణలో ప్రత్యేక పాత్ర పోషించారు.

## మార్కులు గమ్యం కాదు... దాని కోసం చేసిన ప్రయాణమే గొప్పతనం

**- 570 మార్కులకు పైగా సాధించిన పోలీసు కుటుంబాల విద్యార్థులతో ఎస్పీ మణికంఠ చందోలు**



చిత్తూరు టౌన్, మే 5 ప్రభాతవార్త: పరీక్షల్లో వచ్చిన మార్కులు మీ గమ్యం కాదు దాని కోసం మీరు చేసిన ప్రయాణమే అసలైన గొప్పతనం అని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు కుటుంబాల విద్యార్థులతో పేర్కొన్నారు. 2025 టెన్త్ పరీక్షల్లో 570 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన పోలీసు కుటుంబాల్లోని విద్యార్థులకు సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో వారికి విలువైన బహుమతులు ప్రదానం చేశారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్ సమావేశభవనలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తును రూపుదిద్దేందుకు తీసుకున్న ఓ చిన్న ప్రయత్నంలో భాగంగా ఈ బహుమతుల ప్రదానం చేయడం జరిగిందన్నారు. పోలీసు కుటుంబాలకు బాధ్యతలు గణనీయంగా వుంటాయని, ఇలాంటి బిజీ జీవితంలో సైతం పిల్లలు తమ కృషి, పట్టుదలతో అద్భుతమైన ఫలితాలు సాధించడం గర్వకారణం అన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి మద్దతు ఇవ్వడం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. విద్యార్థులు ఏ రంగంను ఎంచుకున్నా దానిపై పూర్తి కసితో పని చేయాలని, స్పష్టమైన లక్ష్యం వుంటే ఎద్దైనా సాధ్యమేనన్నారు. విద్య మన జీవితంను మార్చే శక్తివంతమైన ఆయుధం అని, విద్యార్థులు ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకుని సమాజంకు మంచి చేయగల స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఎఎస్పీ రాజశేఖర్‌రాజు, ఏఆర్ ఎఎస్పీ శివానంద కిషోర్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ భాస్కర్, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు, ఆర్ఐలు సుధాకర్, భాస్కర్, చంద్రశేఖర్‌లు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, పోలీసు కుటుంబాల విద్యార్థులు, వారి తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో సినీదంపతులు



శ్రీకాళహస్తి, మే 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం సినీ సింగర్ కృష్ణచైతన్య, యాంకర్ మృదుల దంపతులు విచ్చేసి ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈసందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని శివయ్యను, అమ్మవారు జ్ఞానప్రసూనాంబిక దర్శనంతో తన్మయత్వం చెందామన్నారు. అనంతరం వీరికి ఆలయంలోని మృత్యుంజయుని సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఆలయాధికారులు ఉన్నారు.

## అపోలో వైద్యుల నిర్లక్ష్యంతో గాలిలో ప్రజల ప్రాణాలు

**- సత్వరం ఎంఓయు రద్దుకు చర్యలు**

**- వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసి విన్నవించిన మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్**



చిత్తూరు, మే 5 ప్రభాతవార్త: చిత్తూరు అపోలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చి చికిత్స చేసుకుంటున్న రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఈ విషయంపై ప్రభుత్వం సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబును కలిసి మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం కోరారు. చిత్తూరు పర్యటన నిమిత్తం వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీని సోమవారం మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ షణ్ముగం కలిసి అపోలో వైద్యుల నిర్లక్ష్య వైద్యంపై వినతిపత్రం అందజేశారు. తన కుమార్తె అపోలో వైద్యుల నిర్లక్ష్య వైద్యం వల్ల మృతి చెందిందని ఈ విషయంపై తక్షణం విచారణ నిర్వహించి సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం అపోలో యాజమాన్యంతో కుదుర్చుకున్న ఎంఓయును రద్దు చేసి చిత్తూరు ఆసుపత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి శోభారాణి, రాష్ట్ర తెలుగుదేశం మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ సిఎం విజయ, మాజీ కార్పొరేటర్ కంద, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



తాతయ్యగుంట గంగమ్మ జాతరకు టిటిడి ఛైర్మన బీఆర్ నాయుడుకు ఆహ్వానం అందించిన ఆలయ ఇఒ , అర్చకుడు తదితరులు.

-ప్రభాతవార్త, తిరుపతి